
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 7 జూలై 2025

ఆశలు 'ఓపెన్'

- వెంకటేష్ ఉపరితల ఖనితో కొత్తగూడెం ఏరియాకు మహర్దశ
- కార్మిక ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు కొత్త ఆశలు 6
- సింగరేణి చైర్మన్ బలరాం కృషితో అన్ని రకాల అనుమతులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఊరేగింపు అనంతరం ప్రశాంతంగా పీర్ల నిమజ్జనం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 6(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హస్సేన్, హుస్సేన్‌లనే ముస్లిం సోదరుల స్మారకార్థం ముస్లింలు ఈ పండుగను నిర్వహిస్తారు. జిల్లాలో అధికంగా గ్రామీణ ప్రాంతాల్లోనే పీర్ల పండుగలను నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా హిందూ, ముస్లింలు ఈ మొహర్రం పండుగలో పాల్గొన్నారు. గత పది రోజులుగా పీర్ల సావిడిల వద్ద రాత్రిపూట ప్రత్యేక పూజలు నిర్వహించి ఆఖరు రోజు ఆదివారం పీర్లను గ్రామాల్లో ఊరేగించి రాత్రి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పీర్ల కొట్టాల వద్ద నిప్పులగుండాన్ని ఏర్పాటు చేసి 'హసయ్‌దులా' అంటూ వారి త్యాగాలను స్మరిస్తూ నిప్పుల గుండం చుట్టూ తిరుగుతూ పాటలు పాడి డబ్బు దరువుల మధ్య పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. శనివారం రాత్రి నుంచి ఉపవాసాలు చేసిన ముస్లిం యువకులు, పెద్దలు ఆదివారం ఉదయం పీర్లను ఎత్తుకొని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఎంతో భక్తి భావంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి వేళ నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేశారు.



ఖమ్మం జయనగర్ కాలనీలో ఊరేగింపుగా వచ్చిన పీరీలు

కోలాహలంగా ఊరేగింపు

మొహరం సందర్భంగా గత 9 రోజులుగా పూజలు అందుకున్న పీర్లకు 10వ రోజు ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులలో పిల్లలు, పెద్దలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కుల మతాలకు అతీతంగా పీర్లు తమ ఇంటి ముందుకు వచ్చినప్పుడు నీళ్లారబోసి కానుకలు అందించారు. అనంతరం చెరువులు, వాగులు నదులలో పీర్లను నిమజ్జనం చేశారు.

ఘనంగా తొలి ఏకాదశి

భక్తులతో సందడిగా మారిన ఆలయాలు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 6(ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాలు ఉగాది తరువాత హిందువుల మొట్టమొదటి పండుగ అయిన తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఆలయాలతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాలల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వంహించారు. ఈ పండుగతోనే హిందువుల పర్వదినాలు ప్రారంభమవుతాయి. హిందూ సంప్రదాయంలో తొలి ఏకాదశికి విశిష్ట స్థానం ఉంది. ఈ పండుగ ఆనందంతో పాటు ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది. ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఖమ్మం నగరంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కమాన్‌బజార్ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఇందిరానగర్ పర్ణశాల రామాలయం, బాలాజీనగర్‌లోని అభయ వేంకటేశ్వరస్వామి ఆలయం, రామాలయం, గుంటుమల్లన్న స్వామి ఆలయం, బ్రాహ్మణ బజారు శివాలయంతోపాటు పలు ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై దేవతామూర్తులను దర్శించుకున్నారు. విష్ణు నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. దర్శనం అనంతరం భక్తులకు పేలపిండితో పాటు తీర్థప్రసాదాలు అందించారు.



ఖమ్మంలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు, ఆలయంలో భక్తుల రద్దీ



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పేదరిక నిర్మూలనే
ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టిన వారికి ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదు
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం కొత్తగూడెం నియోజకవర్గానికి చెందిన 2,500మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్నివర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4లక్షల 50వేల గృహాలు మంజూరు చేయగా నియోజకవర్గానికి 3,500 గృహాలను మంజూరు చేశామని తెలిపారు. మరో 1,500 గృహాలను బఫర్‌జోన్ ద్వారా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షల 50 ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మిగతా 2లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పత్రాలను అందజేశామని తెలిపారు. ఒక్కొక్క ఇంటికి రూ.5లక్షలను దశలవారీగా అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం మహిళలకు (మిగతా 6వ పేజీలో)

ఇందిరమ్మ ఇళ్ల పథకం
దేశానికే ఆదర్శం



లబ్ధిదారులకు ఇంటి పట్టా అందజేస్తున్న భట్టి

- ఏడాదిలోనే పేదల ఇళ్ల కోసం రూ.22వేల కోట్లు
- వచ్చే మూడేళ్లు మరెన్నో పథకాలు అందిస్తాం..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిరటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఒక్క ఏడాదిలో 4.5లక్షల పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రూ.22వేల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదని, అటువంటి పథకాన్ని అమలు చేసి తెలంగాణలోని ప్రజాప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిరలో ఆదివారం మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ గత పదేళ్ల అధికారంలో ఉన్న వారు 'డబుల్‌బెడ్ రూం' పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నో ఆశలతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా తాను సహచర మంత్రులంతా దృఢ సంకల్పంతో పనిచేసి ఒక్క ఏడాదిలోనే 4.5 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.22వేల కోట్లను ఖర్చు చేయనుందన్నారు. కులం, మతం, పార్టీ అనే బేధాలు చూడకుండా అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో ఈ పథకం చేపట్టామన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, రానున్న కాలంలో విడతల వారీగా అర్హులందరికీ ఇళ్లు ఇస్తామన్నారు. తొలి ఏకాదశి పర్వదినాన మధిర నియోజకవర్గంలో ఈ పథకాన్ని ప్రారంభించామన్నారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఇందిరమ్మ ఇంటికి ఉచితంగా ఇసుక అందిస్తున్నామని, ఇళ్ల నిర్మాణం సాఫీగా పూర్తయ్యేలా సిమెంట్, ఇనుము, తాపీ మేస్త్రీ తదితర ఖర్చులు పెరగకుండా స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సిమెంట్, స్టీల్ పరిశ్రమల యాజమన్యాలతో మాట్లాడి ధరలు స్థిరంగా ఉండేలా చూస్తామని తెలిపారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఏర్పడిన తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి పోయారన్నారు. తాము రోజుకు (మిగతా 6వ పేజీలో)

20 రోజుల్లో ఇందిరా డెయిరీ
ప్రారంభం కావాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పనుల పురోగతిపై ఖమ్మం కలెక్టర్ అనుదీప్‌తో కలిసి సమీక్ష 6

ఆర్ఎంపీ వైద్యం వికటించి
మహిళ మృతి

- దుమ్ముగూడెం మండలం పత్రిపాకలో ఘటన
- మద్యం మత్తులోనే వైద్యం చేస్తాడని ప్రచారం 7
- ఆర్ఎంపీకి బంధువుల దేహశుద్ధి



భద్రాచలం వద్ద గోదావరి

నేడు స్వల్పంగా పెరగనున్న
గోదావరి

భద్రాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం స్వల్పంగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం 20.3 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం అనంతరం నిలకడగా ఉండి తగ్గుముఖం పట్టింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 7 గంటలకు 18.4 అడుగులకు గోదావరి నీటిమట్టం తగ్గింది. ఈ సమయంలో గోదావరి మరికొద్దిగా తగ్గి అనంతరం పెరుగనుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

చదివేదెలా?

- సమస్యల వలయంలో ఏన్కూరు గురుకులం
- ఉమ్మడి రాష్ట్రంలో అగ్రగామి సంస్థగా గుర్తింపు
- ప్రస్తుతం శిథిల భవనాల్లో విద్యార్థుల వెతలు 6
- పాములు, తేళ్లతో విద్యార్థులు, ఉపాధ్యాయుల భయాందోళన

పాలేరుకు చేరిన
సాగర్ జలాలు

తాగునీటి అవసరాలకోసం ప్రత్యేకంగా విడుదల



నాయకన్‌గూడెం వద్ద ఇన్‌ఫాల్ కెనాల్ ద్వారా పాలేరుకు చేరుతున్న సాగర్ జలాలు

కూసుమంచి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయాన్ని సాగర్ జలాలు చేరుకున్నాయి. నీటిపారుదల శాఖ అధికారుల ప్రతిపాదనలతో ఖమ్మంజిల్లాలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు శుక్రవారం నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మూడు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, మూడురోజులకు ఆదివారం రాత్రికి పాలేరు జలాశయానికి సాగర్ జలాలు చేరుకున్నాయి. ప్రస్తుతం సుమారు 500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని, మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వేతనాభరితం!

- ఆర్థిక ఇబ్బందుల్లో పంచాయతీ కార్మిక కుటుంబాలు
- మూడు నెలలుగా జీతం కోసం ఎదురుచూపులు
- భద్రాద్రి జిల్లాలో 2,020 మంది కార్మికులకు రూ.5.75కోట్ల బకాయిలు



జూలూరుపాడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే పంచాయతీ (మల్టీపర్పస్) కార్మికుల పాత్ర ఎంతో కీలకం.. వారి శ్రమతోనే పల్లెల్లో పరిశుభ్రత, చెత్తసేకరణ, డ్రెయినేజీలో పూడికతీత, పారిశుధ్య పనులు, మొక్కల పెంపకం, విద్యుత్ వెలుగులు తదితర పనులు సాగుతాయి. అంతటి ప్రాధాన్యం కలిగిన కార్మికుల కష్టానికి తగ్గట్టుగా సమయానికి వారికి అందాల్సిన వేతనాలు అందకపోవడంతో వారికి కుటుంబపోషణ భారంగా మారుతోంది. భద్రాద్రి జిల్లాలో 471 పంచాయతీలు ఉండగా 2,020 మంది కార్మికులు (మల్టీ పర్పస్ వర్కర్లు) పని చేస్తున్నారు. వీరు గ్రామాల్లో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పారిశుధ్య పనులను చేపట్టి చెత్తనిల్వలు లేకుండా చేస్తుంటారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడం, చెత్తసేకరణతో పాటు వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ, మొక్కల పెంపకం, విద్యుత్ దీపాలు తదితర పనులను చేపడుతుంటారు. ఇన్ని పనులు చేస్తున్నా.. వారికి సకాలంలో వేతనాలు అందక వెతలపాలవుతున్నారు.

నెలల తరబడి వేతనాల కోసం ఎదురుచూపులు..

సక్రమంగా వేతనాలు అందకపోవడంతో కార్మిక కుటుంబాలు అష్టకష్టాలు అనుభవిస్తున్నాయి. వేతనాల కోసం నిత్యం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం కానరావడం లేదు. వీరి గోడు పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఒక్కొక్క కార్మికుడికి నెలకు ప్రభుత్వం రూ.9,500 చొప్పున చెల్లిస్తోంది. కాగా మూడు నెలల నుంచి వీరికి వేతనాలు అందిన పాపాన పోలేదు. మూడు నెలలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు రూ.5.75కోట్ల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. తమ వేతనాలను ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. కార్మికులు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి తమకు వేతనాలు ఇప్పించాలని వేడుకుంటున్నా పరిస్థితుల్లో మార్పు లేదు.

పనుల పట్ల కార్మికుల్లో అనాశక్తి..

వేతనాలు సకాలంలో అందకపోవడంతో కష్టాలపాలవుతున్న కార్మికులు గ్రామాల్లో పనులు చేపట్టడానికి (మిగతా 6వ పేజీలో)

వేతనాల చెల్లింపుల్లో జాప్యం తగదు

లకావత్ సురేష్, కార్మికుడు మాచినేనిపేటతండా



వేతనాల చెల్లింపుల్లో సర్కార్ పక్షపాతం వహిస్తోంది. మాలాంటి శ్రమజీవులకు వేతనాల చెల్లింపుల్లో జాప్యం చేస్తూ పక్షపాతం చూపడం సరైంది కాదు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి వెంటనే పెండింగ్ వేతనాలను ఖాతాల్లో జమచేయాలి.

తక్షణమే వేతనాలను చెల్లించాలి

తంబర్ల లక్ష్మి, కార్మికురాలు, వెంగన్నపాలెం



మేము నెలలపాటు చేసిన శ్రమకు తగిన వేతనాలను సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారింది. నెలల తరబడి వేతనాల కోసం ఎదురుచూస్తూ నిరాశ చెందుతున్నాం. చేసిన పనికి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం ఇంత జాప్యం చేస్తే మా జీవనం ఎలా సాగుతుంది. మా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే బకాయిపడిన వేతనాలను మంజూరు చేయాలి.



దమ్మక్క చిత్రపటంతో గిరి ప్రదక్షిణ (ఫైల్)

అభినవ శబరి దమ్మక్క

- 10న వెంకటాపురంలో పోకల దమ్మక్క సేవాయాత్ర
- భద్రాద్రిలో గిరి ప్రదక్షిణ, దమ్మక్క విగ్రహానికి పూజలు

భద్రాచలం, జూలై 6(ఆంధ్రజ్యోతి): అభినవ భక్త శబరి పోకల దమ్మక్క ధన్యచరిత.. తొలుత భద్రాద్రి రాముడిని సేవించిన ఘనత ఆమెదే. 2014లో అప్పటి రెవెన్యూ, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్ వినోద్‌కుమార్ అగర్వాల్ భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి ఏటా దమ్మక్క పేరిట సేవాయాత్ర నిర్వహించాలని ప్రతిపాదించారు. ఇందుకు ఆనాటి సభ్యులు సైతం ఆమోదం తెలిపి సేవాయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 10న సేవాయాత్ర నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రచారరథం ద్వారా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహణ అనంతరం భక్తులకు ప్రసాదంతోపాటు అన్నప్రసాదం అందజేయనున్నారు. అదేవిధంగా భద్రాచలం రామయ్య సన్నిధిలో దమ్మక్క చిత్రపటంతో గిరిప్రదక్షిణ తెలంగాణ టూరిజం వద్ద దమ్మక్క విగ్రహానికి పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ క్రమంలో గిరిజనులను భాగస్వాములను చేయనున్నారు.

భద్రాద్రి రామయ్యకు తొలిపూజలు..

అచెంచలమైన భక్తి విశ్వాసాలతో భద్రాచల రాముడి అనుగ్రహానికి పాత్రురాలైన అభినవ భక్తశబరి పోకల దమ్మక్క స్వప్నంలో సాక్షాత్కరించిన సీతారామ లక్ష్మణుల మూర్తులను భద్రగిరిపైన పుట్టను దర్శించిన మహనీయురాలు దమ్మక్క. భద్రగిరీషునికి తాటాకు పందిరేసి పూజలందించిన దమ్మక్క. తన సంరక్షణలోని స్వామివారి మూర్తులను భక్తరామదాసుకు దర్శింపజేసి ఈ క్షేత్రాన్ని పూజించించడంలో ధన్యురాలు దమ్మక్క. ఈ మహనీయురాలి సేవలను స్మరిస్తూ భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన ప్రాంగణానికి దమ్మక్క నిత్యాన్నదాన సత్రం అని పేరు పెట్టారు. ప్రతి ఏటా ఆషాడ పౌర్ణమి రోజు దమ్మక్క సేవాయాత్ర అనే ఉత్సవాన్ని దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 10న జరిగే ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి పరిపూర్ణ అనుగ్రహానికి పాత్రులు కావాలని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి కోరారు.

కరకట్టపై ప్లాట్‌ఫాం నిర్మాణం

- కట్ట దెబ్బతినకుండా ఎట్టకేలకు పనులు
- నీటి వల్ల కట్టకు ప్రమాదం లేకుండా ఏర్పాటు
- రివిట్‌మెంట్ భాగం చెడకుండా చర్యలు
- వానాకాలం దాటాక ప్రారంభించే అవకాశం
- కరకట్ట వద్ద ఇళ్లు నిర్మించకుండా ప్లాన్


కరకట్టపై ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాం

భద్రాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈ వర్షాకాలం సీజన్‌లో గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో వచ్చే వరదలను ఎదుర్కొనేందుకు నీటిపారుదల శాఖ ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. వరదల సమయంలో విస్తా కాంప్లెక్సు వద్ద ఉన్న స్లూయిస్ మూసి ఉంచడంతో విస్తా కాంప్లెక్సు పరిసరాల్లో చేరుతున్న డ్రెయిన్, రెయిన్ వాటర్, బ్యాక్ వాటర్లను మోటార్ల ద్వారా గోదావరిలోకి ఎత్తిపోసే సమయంలో కరకట్ట లోపలి రివిట్‌మెంటు భాగం గతంలో దెబ్బతింటోందని విమర్శలొచ్చాయి. ఈ క్రమంలో అధికారులు కరకట్ట లోపలి రివిట్‌మెంటు భాగానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేశారు. దీంతో మోటర్ల నుంచి భారీగా వచ్చే నీరు ప్లాట్‌ఫాంపై పడి కట్ట రివిట్‌మెంటుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కరకట్ట లోపలి రివిట్‌మెంటు ప్రాంతం దెబ్బతిన్న చోట మరమ్మతు పనులు సైతం చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

సీజన్ ఇప్పటికే ప్రారంభమైన తరుణంలో అధికారులు ఈ పనులను అనంతరం చేపట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. వాస్తవానికి ఎండాకాలం సమయంలోనే ఈ పనులను చేపడితే బాగుండేదనే వ్యాఖ్యలు సైతం వినిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో వరదలను ఎదుర్కొనేందుకు 250 హెచ్‌పీ మోటార్లు నాలుగు వినియోగిస్తుండగా మూడు విస్తాకాంప్లెక్సు వద్ద, ఒకటి అశోకనగర్ కొత్తకాలనీ వద్ద ఏర్పాటు చేయనున్నారు. 50 హెచ్‌పీ ఎలక్ట్రికల్ మోటార్లు ఐదు విస్తా కాంప్లెక్సు వద్ద సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. అశోకనగర్ కొత్తకాలనీ వద్ద గతంలో కరకట్ట పక్కనే ఉన్న పూరిళ్లను ఇటీవల రెవెన్యూ అధికారులు తొలగించి వారికి ప్రత్యామ్నాయంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో భవిష్యత్తులో ఇళ్లను ఎవరు ఏర్పాటు చేసుకోకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసే ఆలోచనలో నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు. ఇందుకు సంబంధించి చర్యలు త్వరలోనే చేపట్టనున్నారు.

చదివేదెలా?

- సమస్యల వలయంలో ఏన్కూరు గురుకులం
- ఉమ్మడి రాష్ట్రంలో అగ్రగామి సంస్థగా గుర్తింపు
- ప్రస్తుతం శిథిల భవనాల్లో విద్యార్థుల వెతలు
- డార్మెటరీల్లోనే తరగతుల నిర్వహణ
- పాములు, తేళ్లతో విద్యార్థులు, ఉపాధ్యాయుల భయాందోళన


తరగతి గదిలోనే డార్మెటరీ

ఏన్కూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో ఓ వెలుగు వెలిగిన ఏన్కూరు గురుకుల పాఠశాల నేడు సమస్యలతో సతమతమవుతోంది. 1983లో 300మంది విద్యార్థుల కోసం అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గురుకులాన్ని తాత్కాలికంగా ఎస్ఎస్‌పీ క్వార్టర్లలో ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి శిథిల క్వార్టర్లలోనే కొనసాగుతూ 2018లో జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ అయింది. విద్యార్థులకు అప్పటి నుంచి మరిన్ని కష్టాలు మొదలయ్యాయి. 640మంది విద్యార్థులు అవే అరకొర సౌకర్యాలతో విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ విద్యను అభ్యసించిన వేలాది మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత పదవుల్లో ఉండడం విశేషం.

రహదారే ప్రధాన సమస్య

పాఠశాల ప్రధాన ద్వారమే సీఎల్ ఆర్‌సీ, వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలకు రహదారి కావడం వల్ల విద్యార్థులకు రక్షణ కొరవడింది. ఈకార్యాలయాలకు వెళ్లే సిబ్బంది కోసం గేట్లు తెరిచి ఉండడం వల్ల అపరిచిత వ్యక్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు నిత్యం రాకపోకలు వల్ల పాఠశాల విధులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దీంతో ఉపాధ్యాయులకు బోధన కంటే విద్యార్థుల రక్షణపైనే ఎక్కువగా దృష్టి పెట్టాల్సి వస్తోంది. పాఠశాల పక్కనే ఎస్ఎస్‌పీ క్వార్టర్లు శిథిలావస్థలో ఉన్నాయి. చెత్తాచెదారం, ముళ్ల పొదలతో నిండి ఉండి పాములు, తేళ్లకు ఆశ్రయంగా మారింది. పాఠశాల పరిసరాల్లో పాములు, తేళ్లు తిరుగుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.


శిథిలావస్థకు చేరిన డార్మెటరీ

ఈ పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు వరకు సుమారు 640మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, పడుకోవడానికి సరిపడా డార్మెటరీ సౌకర్యం లేక క్లాస్‌రూంల్లోనే ఇబ్బంది పడుతూ పడుకుంటున్నారు. ఉన్న డార్మెటరీ శిథిలావస్థలో ఉంది.

భోజనశాల లేక ఆరు బయటనే వర్షాకాలం వర్షానికి తడుస్తూ భోజనం చేస్తూ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధ్యాయులు ఉండడానికి క్వార్టర్లు లేవు. కొంతమంది శిథిల క్వార్టర్లలోనే బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్నారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న ఉపాధ్యాయుల క్వార్టర్లు

ఆశలు 'ఓపెన్'

- వెంకటేష్ ఉపరితల ఖనితో కొత్తగూడెం ఏరియాకు మహర్దశ
- కార్మిక ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు కొత్త ఆశలు
- సింగరేణి చైర్మన్ బలరాం కృషితో అన్ని రకాల అనుమతులు

రుద్రంపూర్, (సింగరేణి) జూలై 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో వెంకటేష్‌ఖని ఓపెన్‌కాస్టుతో కార్మిక ప్రాంతాలైన రుద్రంపూర్, గౌతంపూర్ ఏరియాలకు మహర్దశ రానుంది. కొత్తగూడెం ఏరియాలోని గౌతంఖని ఓపెన్‌కాస్టు మూసివేయడంతో ఇక్కడ పని చేస్తున్న వందలాది మంది కార్మికులు, ఉద్యోగులను సత్తుపల్లిలోని జేవీఆర్, కిష్టారం ఓపెన్‌కాస్టులకు సింగరేణి యాజమాన్యం బదిలీ చేసింది. వీకే7 ఓపెన్‌కాస్టు అనుమతుల కోసం సింగరేణి యాజమాన్యం గత నాలుళ్లగా తీవ్ర ప్రయత్నాలను చేసింది. అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు, మైనింగ్ తదితర అనుమతులు రావడంతో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు గత నెలలో వెంకటేష్‌ఖని ఓపెన్‌కాస్టుకు అవసరమైన అన్నిరకాల అనుమతులను సింగరేణి యాజమాన్యం సాధించింది. దీంతో ఈ నెలలో వీకే 7 ఓపెన్‌కాస్టు నిర్మాణ పనులకు భూమి పూజ చేయనున్నట్లు సింగరేణి చైర్మన్ ఎన్. బలరాం శనివారం ప్రకటించడంతో కొత్త ఆశలు చిగురించాయి.

ఓపెన్‌కాస్టు ఏర్పాటుతో కార్మిక ప్రాంతాలు, సమీప ప్రాంతాల నిరుద్యోగ యువతకు అవుట్‌సోర్సింగ్ ద్వార ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి. సింగరేణిలో పర్మినెంట్ ఉద్యోగులు ఇతర ప్రాంతాలైన జేవీఆర్. ఓపెన్‌కాస్టు, ఓపెన్‌కాస్టుకు వెళ్లకుండ స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయి. ఇప్పటికే పీవీకే 5 ఇంక్లైన్‌కు సంబంధించిన కార్మికులను సైతం యాజమాన్యం ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. బదిలీ అయిన కార్మికులు మళ్లీ వెంకటేష్‌ఖని ఓపెన్‌కాస్టుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే భూమి పూజ చేయనున్నట్లు వార్తలు రావడంతో కార్మికులు, కార్మిక కుటుంబాలు, సమీప ప్రాంత ప్రజలు హర్షం ప్రకటిస్తోన్నారు. వెంకటేష్‌ఖని ఓపెన్‌కాస్టు భవిష్యత్ 30 ఏళ్లకు పైగా సరిపడ బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు అన్వేషణ విభాగం అంచనా వేసింది.

కొత్తగూడెం ఏరియాలో భూగర్భ బావులతో కళకళలాడే కార్మిక ప్రాంతాలు నేడు బావులు వెలవెలబోతున్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. వెంకటేష్‌ఖని ఏర్పాటుతో పూర్వ వైభవం వచ్చే అవకాశాలు ఉన్నట్లు కార్మిక సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైన వీకే 7 ఓపెన్‌కాస్టుతో గౌతంపూర్, రుద్రంపూర్ తదితర ప్రాంతాలకు జీవకళ వచ్చే అవకాశాలు ఉన్నట్లు స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెలలో భూమి పూజ నిర్వహిస్తాం

ఎన్. బలరాం, సింగరేణి సీఎండీ



వెంకటేష్‌ఖని ఓపెన్‌కాస్టుకు సంబంధించి అన్ని రకాల అనుమతులను సాధించాం. ఈ నెలలోనే భూమి పూజ చేసి పనులు ప్రారంభింప చేస్తాం. కొత్తగూడెంలోని వీకే7కు పూర్తి అనుమతులు రాగా ఇల్లెందు ఏరియాలోని జేకేఓపెన్‌కాస్టుకుమరకొన్ని అనుమతులు త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. ఒడిసా రాష్ట్రంలోని నైనీ ప్రాజక్టులో సైతం బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాం.

తీర్థ యాత్రలకు ప్రత్యేక బస్సులు

- 12వ తేదీన సర్వీసులు
- భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతి

భద్రాచలం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 12న తీర్థ యాత్రలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజరు తిరుపతి తెలిపారు. 12న శుక్రవారం రాత్రి 9 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి యాదగిరిగుట్ట, స్వర్ణగిరి కొలనుపాకం దేవాలయాలను దర్శించి తిరిగి శనివారం రాత్రి 9 గంటలకు చేరుకుంటుంది. మరోసూపర్ లగ్జరీ బస్సు అన్నవరం, వాడపల్లి, ద్వారకా తిరుమల, మద్ది ఆంజనేయస్వామి దేవాలయను దర్శించుకొని శనివారం రాత్రి 9 గంటలకు భద్రాచలం చేరుకుంటుంది. టికెట్ ధర రూ.1400 పెద్దలకు, పిల్లలకు రూ.750 ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 93906 12253, 90634 14561లలో సంప్రదించాలని కోరారు.

రెండేళ్లకు నెరవేరిన హామీ

- నాడు హామీ - నేడు పట్టా అందజేత
- మాయాబజార్ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు అందజేసిన మంత్రి పొంగులేటి


నాడు రుద్రంపూర్ సెల్ టవర్ ఎక్కిన శివకుమార్‌తో మైకులో మాట్లాడుతూ హామీ ఇచ్చిన పొంగులేటి


భూనిర్వాసితుడు శివకుమార్‌కు ఇంటి పట్టాను అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓ నిర్వాసితుడికి ఇచ్చిన హామీ ఆదివారం నెరవేరింది. 2023 అక్టోబరు 3న చుంచుపల్లి మండలంలోని మాయాబజార్ గ్రామానికి చెందిన పెచ్చేటి శివకుమార్ రుద్రంపూర్‌లోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఎక్కి ఇంటి స్థలం మంజూరు చేయలేదని నిరసన తెలిపాడు. ఈ సంఘటన ఆందోళనకరంగా మారడంతో విషయం తెలుసుకున్న కొత్తగూడెం పర్యటనలో వివిధ కార్యక్రమాల్లో ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. తక్షణమే మైక్ సహాయంతో బాధితుడు శివకుమార్‌కు నచ్చచెప్పారు. కొత్తగూడెం ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి బాధిత నిర్వాసితుడికి న్యాయం జరిగేలా రాబోయే రోజుల్లో చర్యలు తీసుకోవాలని మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తప్పక అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం, డబుల్ బెడ్‌రూమ్ కేటాయిస్తామని, ఇల్లు కట్టిస్తామని పొంగులేటి శివకుమార్‌కు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏర్పడడంతో మంత్రి పొంగులేటి కొత్తగూడెంలో క్లబ్‌లో ఉమ్మడి రుద్రంపూర్ పంచాయతీలో 45 మంది జీకెవోసీ భూ నిర్వాసితులకు ఇంటి స్థల పట్టాలు పంపిణీ చేశారు. ఈ క్రమంలో గతంలో నిర్వాసితుడు శివకుమార్‌కు ఇచ్చిన హామీని తు.చ. తప్పకుండా నెరవేర్చారు. నాడు హామీ - నేడు పట్టా పంపిణీ చేయడంతో చుంచుపల్లి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం తనకు ఇంటి స్థలం కేటాయించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి శివకుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

'పల్లె వెలుగు'లో ప్రయాణిస్తూ ప్రజా సమస్యలపై ఆరా

- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వినూత్న కార్యక్రమం
- సమస్యలు పరిష్కరిస్తామని హామీ


ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ ప్రయాణికులతో ఆత్మీయ పలకరింపులు చేస్తూ ప్రభుత్వ పథకాలు, ప్రజాసమస్యలపై ఆరా తీశారు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ. వివరాల్లోకి వెళితే అశ్వారావుపేటలో జరిగే లయన్స్‌క్లబ్ ప్రమాణస్వీకారానికి వస్తూ ఎమ్మెల్యే జారే దమ్మపేట మండలంలోని మందలపల్లిలో ఆర్టీసీ పల్లె వెలుగు ఎక్కారు. బస్‌లో ఉన్న మహిళలు, ప్రయాణికులను ఆత్మీయంగా పలకరించారు. అశ్వారావుపేట వరకు ప్రయాణించిన ఎమ్మెల్యే దారిలో వారితో ముచ్చటించారు. ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయి, పథకాలను పొందేటపుడు ఏమైనా సమస్యలు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామాల్లో ఉన్న సమస్య లు కూడా కోరగా పలువురు తమ సమస్యలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలను అర్థం చేసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు.

రోగులకు సేవలు అందించండి: ఎమ్మెల్యే ఆదినారాయణ

ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. అశ్వారావుపేటలో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యే 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులతో మాట్లాడారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన ఎకో పార్క్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జూపల్లి ప్రమోద్, మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, నాయకులు రాములు, ముత్తయ్య, రామారావుతో పాటు పలువురు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే ఆదర్శం

(5వ పేజీ తరువాయి)

18 గంటలు కష్టపడి పనిచేస్తూ గత పాలకులు చేసిన అప్పులు చెల్లిస్తూనే సంక్షేమాన్ని, అభివృద్ధిని ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ప్రజాప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో తమకు పుట్టగతులు ఉండవని ప్రతిపక్షాలు ఆందోళన చెంది కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాము ప్రజల కోసం నిటారుగా నిలబడతామన్నారు. రాష్ట్రంలో 1.12 కోట్ల కుటుంబాలు ఉంటే 93లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, వీరందరికి 200 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. ఏడాదిన్నరలోనే అనేక పథకాలు అమలు చేశామని, రానున్న మూడున్నరేళ్లలో మరిన్ని అద్భుతమైన పథకాలు ప్రజల కోసం తీసుకు వస్తామన్నారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీపీవో ఆశాలత, హౌజింగ్ పీడీ శ్రీనివాస్, ఆత్మ చైర్మన్ కోటి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహారావు, తహసీల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేతనాభరితం!

(5వ పేజీ తరువాయి)

ఆసక్తి చూపడం లేదు. దీంతో వారు నిరాశకు లోనై బయటపనులు, రోజు వారి కూలీ పనులకు వెళ్తున్నారు. ఫలితంగా కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పారిశుధ్య పనులు కుంటుపడ్డాయి. కార్మికులు గ్రామాల్లో పనులకు దూరం కావడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. చెత్త నిల్వలు పేరుకుపోయాయి. వర్షాలకు డ్రైనేజీలు నిండిపోయి రహదారులపైకి నీటి నిల్వలు చేరి అస్తవ్యస్తంగా మారాయి. ఈ కారణంగా గ్రామాల్లో అంటు వ్యాధులు సోకే పరిస్థితి నెలకొనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను గుర్తించి వెంటనే వేతనాలను మంజూరు చేయాలని కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

త్వరలోనే కార్మికులకు వేతనాలు

చంద్రమౌళి, భద్రాద్రి డీపీవో



భద్రాద్రి జిల్లాలోని పంచాయతీ కార్మికులకు సంబంధించిన పెండింగ్ వేతనాలను త్వరలోనే ప్రభుత్వం వారి ఖాతాల్లో జమచేస్తుంది. కార్మికులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దు. ఇప్పటికే కార్మికుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వారి సమస్యలు పరిష్కారమవతాయి.

20 రోజుల్లో ఇందిరా డెయిరీ ప్రారంభం కావాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పనుల పురోగతిపై కలెక్టర్ అనుదీప్‌తో కలిసి సమీక్ష


ఇందిరా డెయిరీ అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

మధిరటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రానున్న ఇరవై రోజుల్లో ఇందిరా డెయిరీ నియోజకవర్గ స్థాయిలో ప్రారంభం కావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఇందిరా డెయిరీపై ఖమ్మం కలెక్టర్ అనుదీప్‌తో కలిసి ఇందిరా డెయిరీ ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ప్రతి లబ్ధిదారుడికి రెండు గేదెలతో పాటు నాలుగు పశువులకు సరిపడా షెడ్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ క్రమంలో అసలు గేదెలు లేని వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 15 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి 20 రోజుల్లో నియోజకవర్గం అంతా ప్రారంభం కావాలని ఆదేశించారు. పశువుల కొనుగోలు బృందంలో తప్పనిసరిగా ఒక విజిలెన్స్ అధికారి ఉండాలని, గేదెల కొనుగోలు పారదర్శకంగా జరగాలన్నారు. గేదెలకు అవసరమైన గడ్డి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గడ్డి, దాణా రవాణాకు యువతను వినియోగించుకుని వారికి వాహనాలు తదితర సామగ్రి సమకూర్చి ఉపాధి కలిగేలా చూడాలన్నారు. సమీక్షలో డీఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పురేందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, అగ్రికల్చరల్ ఏడీఈ విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

ఉచిత బస్సు సదుపాయం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలెండర్, అనారోగ్యానికి గురైనవారికి వైద్య సదుపాయం కోసం రూ.10లక్షలను అందిస్తున్నామని, కొత్తరేషన్‌కార్డులు అందించడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమం కోసం రైతుభరోసా ద్వారా 9రోజుల్లో రూ.9వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. గత పాలకులు తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెడితే ప్రజాప్రభుత్వం ప్రజల్లో ఆత్మగౌరవాన్ని పెంచుతోందన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఎవరైనా ముడుపులు అడిగితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో ఎలాంటి పైరవీలకు అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ట్రైనీ కలెక్టర్ శర్మ, సింగరేణి డైరెక్టర్ కే. వెంకటేశ్వర్లు, ఆర్డీవో మధు, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణ ప్రసాద్, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, కొత్వాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కవిత్వంతో సమాజంలో చైతన్యం

» కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై6(ఆంధ్రజ్యోతి): సామాజిక సమస్యలపై కవులు వారి కవిత్వంతో సమాజానికి చైతన్యం కలిగిస్తున్నారని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభివర్ణించారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో ప్రజాసంఘాల వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ అవార్డు గ్రహీత, ప్రముఖ ప్రజా ప్రకృతి కవి జయరాజును సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరై మాట్లాడారు. సమాజాన్ని చైతన్యం వైపు నడిపించేందుకు కవులు, రచయితలు ఎంతో మానసిక సంఘర్షణలను ఎదుర్కొంటారని పేర్కొన్నారు. ప్రజా కవి జయరాజ్‌తో పాటు వివిధ రంగాలలో విశేష సేవలందించిన మరో 14 మందిని సన్మానితులుగా ఎంపిక చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు. అనంతరం ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ జేబీ.శౌరీ మాట్లాడు తూ జయరాజ్ కేవలం కవి మాత్రమే కాకుండా , సామాజిక ఉద్యమాల యోధులని అన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ కార్యక్రమం ఏర్పాటు చేసిన అంబేద్కర్ వాదులు, సామాజిక ఉద్యమకారులు, ప్రకృతి ప్రేమికులను అభినందించారు. ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ తనకు లభించిన ఈ సన్మానాన్ని సమాజానికి అంకితం చేస్తూ, సన్మానించిన ప్రజా సంఘాల వేదికకు, ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు తాళ్లూరి వెంకటేశ్వరరావు, కోచ్ షమీ ఉద్దీన్, ఎస్‌కె. బాసిత్, కాల్వ దేవదాస్, మొక్కల వెంకటయ్య, వేల్పుల భాస్కర్, సుగుణారావు, కె.కమలరాణి,



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

మాన్విత, గోనె శ్రీకాంత్, జాతీయ బాలోత్సవ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు నిర్వాహక కో-చైర్మన్ కూసపాటి శ్రీను, బిక్కసాని నాగేశ్వర రావు, యర్రా కామేష్, మారపాక రమేష్‌కుమార్, శనగ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లాలో రెండు కొత్త
ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటు

» పాల్వంచ, గుండాల మండలాల్లో మంజూరు

కొత్తగూడెం అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పేద విద్యార్థులకు విద్యాబోధన కోసం నూతన పాఠశాలలను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు లేని అవాసాల్లో, కనీసం 20మంది విద్యార్థులు అంతకుమించి ఉన్న చోట బడులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ ప్రకారం రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో 63, పట్టణ, నగర ప్రాంతాల్లో 94 పాఠశాలలను తక్షణమే ఏర్పాటు చేయాలని డీఈవోలను ఆదేశిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకోసం అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అవసరమయ్యే బడ్జెట్‌ను కలెక్టర్ ద్వారా పాఠశాల విద్యాశాఖ సమకూర్చనుంది. ఈక్రమంలో భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో పాల్వంచ, గుండాల మండలాల్లో నూతన పాఠశాలలు మంజూరయ్యాయి. ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యాబోధన ప్రారంభం అవుతుంది. జిల్లాలో మరో రెండు మండలాల్లో నూతన పాఠశాలలు మంజూరు అయ్యే అవకాశం ఉండగా.. మండల విద్యాశాఖ అధికారులు నివేదికలు సమర్పించడంలో నిర్లక్ష్యం వహించడంతో పేద విద్యార్థులను చదువుకు దూరం చేశారని ఆరోపణలు ఉన్నాయి. పినపాక మండలంలో మనుబోతుల ప్రాంతంతో పాటు చంద్రుగొండ మండలంలో ఎర్రబోరు అటవీప్రాంతం నుంచి 40మంది విద్యార్థులు 4కిలో మీటర్ల దూరంలోని బెండలపాడు స్కూల్‌కు చదువుకోసం వస్తున్నారు. బెండలపాడులో యూపీఎస్‌లోని కొందరు ఉపాధ్యాయులు తమ స్థానాన్ని పదిలం చేసుకునేందుకు పాఠశాల కావాలని నివేదికలు సమర్పించకపోవడంతో ఎర్రబోరులో స్కూల్ మంజూరు కాలేదని వినికిడి.

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో బోధిస్తున్న కొందరు ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. గ్రామీణ, పట్టణ అవాసాల్లో నిరుపేద విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు కొత్త ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలోని చంద్రుగొండ మండలంలోని ఎర్రబోరు నుంచి 40మంది విద్యార్థులు నిత్యం 4కి.మీ దూరంలోని బెండలపాడు స్కూల్స్‌కు చదువుకునేందుకు వెళ్లున్నారు. బెండపాడు నుంచి ఎర్రబోరుకు వెళ్లే రహదారి అటవీప్రాంతంలో ఉండటంతో అటవీ జంతువుల బెడదతో పాటు ప్రయాణ, రవాణా సౌకర్యం మెరుగుగా లేని కారణంగా... ఎర్రబోరులో నూతన స్కూల్ ఏర్పాటుచేస్తే విదులు కేటాయిస్తారని... బెండలపాడు స్కూల్‌లోని కొందరు ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు ఎర్రబోరులోని వారంతా వలసవాదులు అని నివేదికలు సమర్పించారు. ఫలితంగా చంద్రుగొండ మండలం ఎర్రబోరు విద్యార్థులకు మాత్రం నేటికి నూతన స్కూల్ ఏర్పాటుకు నోచుకోలేదు. దీంతో విద్యార్థులు చదువుకునేందుకు సుదూర ప్రాంతంల్లోని పాఠశాలలకు వెళ్తున్నారు. అటవీ జంతువుల భయంతో నెలలో రెండు, మూడు సార్లు మాత్రమే స్కూల్స్‌కు వస్తున్నారు. కొందరు ఉపాధ్యాయుల నిర్వాకమే ఇందుకు కారణం. ఈ విషయమై డీఈవో వెంకటేశ్వరచారిని వివరణకోరగా... యూడైస్ వెబ్‌సైట్‌లో వివరాల ఆధారంగా కొత్త పాఠశాలలు కావాలని ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాం. త్వరలో అవసరమైన చోట నూతన స్కూల్స్ ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తున్నాం.

మహనీయుల పేర్లు పెట్టాలి

» బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగు రాకేష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

ఖమ్మం రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గాంధీల పేర్లు తొలగించి తెలంగాణ మహనీయుల పేర్లు మాత్రమే పెట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగు రాకేష్‌రెడ్డి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయి గణేష్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ ఆనాడు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు పెట్టి అర్హులందరినీ ఎంపిక చేసిన తర్వాత, ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా ఆగిపోయిన ప్రక్రియను రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక పూర్తి చేసి ఆ ఉద్యోగాలు అన్ని తామే ఇచ్చినట్లు ప్రచారం చేసుకోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలకు వారంటీ లేదు..హామీలకు అడ్రస్ లేదని విమర్శించారు. నిత్యం బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్, కేటీఆర్‌లను తిట్టడమే సీఎం పనిగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. బట్టలు ఊడదీసి కొడతామని ప్రభుత్వ అధినేత మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రైతుల విషయానికి వస్తే రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీ అట్టర్ ఫ్లాఫ్ అయిందన్నారు.

మొత్తం రూ.46 వేల కోట్లతో రుణమాఫీ చేయ్యాల్సి ఉండగా, తూతూ మంత్రంగా రూ. 19 వేల కోట్లు మాత్రమే చేయడం జరిగిందన్నారు. రైతుబంధు రెండు పర్యాయాలు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ రైతుకు ఎకరానికి రూ.19 వేలు బాకీ ఉందన్నారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి ఎగనామం పెట్టారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని తెలియచేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, వీరన్న, సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మణ్ నాయక్, కృష్ణారావు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్లిష్ట స్థితిలో దేశ రాజకీయాలు

» నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించలేని ప్రభుత్వాలు

» మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో పదేళ్ల పాటు బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతిని దేశ రాజకీయాలు సంక్లిష్ట స్థితిలోకి వెళ్లాయని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలో సీపీఐ ఖమ్మం నగర మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు, రాజకీయ అంశాలపై ప్రసంగించారు. కమ్యూనిస్టులు ఎంత బలపడితే ప్రజల సమస్యలు అంతగా పరిష్కారం జరుగుతాయన్నారు. ఎప్పటికప్పుడు యువతను ప్రోత్సహిస్తూ రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించాలని సూచించారు.

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నిరుద్యోగుల్ని మభ్య పెట్టి కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాయని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విదంగా ఉద్యోగాలు ఇవ్వటం లేదన్నారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తుల చేతిలో పెట్టి ప్రైవేటీకరణ చేయటంతో కొత్త ఉద్యోగాలు రాలేదని, పదవీ విరమణలే జరిగాయని ఆరోపించారు. అలీన విధానానికి బీజేపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ ఏజెంట్‌గా మారరని ఇటీవల కాలంలో చోటు చేసుకున్న యుద్ధాలకు పరోక్షంగా మోధి అమెరికా విధానాలకు సహకరించారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై సీపీఐ పార్టీ కట్టుబడి ఉందని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎత్తుగడలు వేస్తోందని తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమాలు జరిగిన ప్రాంతంలో బీజేపీ ఆశలు నెరవేరబోవన్నారు. కార్పొరేటర్ బీజీ క్లైమెట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఖమ్మం నగరానికి జనాభా పెరుగుతున్నారని ఆ మేరకు ప్రభుత్వాలు ప్రజలకు నివాసాలు, మౌళిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. కమ్యూనిస్టులు బలంగా ఉండటంతో ప్రశాంతమైన ఖమ్మంగా ఖ్యాతీ పొందిందన్నారు. పార్టీ విస్తరణకు ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు జడ్పీ సెంటర్ నుంచి సెయింట్ మేరిస్ స్కూల్ వరకు ఎర్రకవాత్ చేపట్టారు. అంతకు ముందు ఎర్రజెండాను నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ మహ్మద్ మౌలాన, ఏపూరి లతాదేవి, సలామ్, కొండపర్తి గోవిందరావు, మేకల శ్రీనివాసరావు, ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, పోటు కళావతి తదితరులున్నారు.


మాట్లాడుతున్న పువ్వాడ నాగేశ్వరరావు

మణుగూరు ఐటీఐ నుంచి
ఇద్దరికి ఎక్సలెన్స్ అవార్డు

మణుగూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మణుగూరులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటీఐ) నుంచి ఇద్దరు విద్యార్థులు ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. మణుగూరు ఐటీఐలో చదువుకుని సింగరేణిలో ఉద్యోగాలు చేస్తున్న విద్యార్థులను తెలంగాణ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ వారు ఎక్సలెన్స్ అవార్డులను శనివారం హైదరాబాద్‌లో అందజేశారు. కార్మిక ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఐటీఐ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించిన ఎలక్ట్రిషియన్ ఎస్‌డీ. సమీర్, జే. ద్వారకామైలను ఘనంగా సన్మానించి అవార్డులను అం దించారు. ప్రభుత్వ ఐటీఐల్లో చదువుకుని ఇంతటి ఉన్నత స్థాయికి ఎదగడం అ భినందనీయమన్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవిలు వారిని అభినందించారు.



అవార్డు అందుకుంటున్న సమీర్, ద్వారకామై

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు


నరేష్(ఫైల్)

పాల్వంచ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయాలైన సంఘటన పాల్వంచ కేఎస్ఎం పెట్రోల్ బంక్ ప్రాంతంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మణుగూరుకు చెందిన రాధారపు దేవదాసు, పాల్వంచకు చెందిన వనపర్తి నరేష్(32)లు స్థానికంగా ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. కాలేజీ క్యాంపెయినింగ్ కోసం కొత్తగూడెం పాలిటెక్నిక్ కాలేజీకి వెళ్లి పాల్వంచకు కళాశాల ఏర్పాటు చేసిన కారులో తిరుగుప్రయాణమయ్యారు. నవభారత్ ప్రాంతానికి చేరుకునే సరికి వర్షం పడటం, ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో డ్రైవర్ రాంశ్రీ కంగారుగా అద్దాలు తుడిచే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాంశ్రీతో పాటు ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా నరేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న లక్ష్మీదేవిపల్లి పోలీసులు ప్రాథమిక విచారణ నిర్వహించారు. కేసు నమోదు చేయాల్సి ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుండెపోటుతో వ్యవసాయ కూలీ..


పెద్ద గోపయ్య(ఫైల్)

కూసుమంచి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పొలానికి నారు పంచుతూ గుండెపోటుతో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మల్లాయిగూడెం గ్రామానికి చెందిన వ్యవసాయకూలీగా జీవనం గడుపుతున్న మారుతీ పెద్ద గోపయ్య(60) జుజ్జులరావుపేట గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అనే రైతు పొలంలో నాటు పనులకు వెళ్లాడు. కొంత సేపటికి గుండెల్లో నొప్పి వస్తుందని, ఆయాసంగా ఉందని చెబుతూ కిందపడిపోయాడు. వెంటనే మిగిలిన కూలీలు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. మరికొందరు సీఆర్‌పీ చేసినప్పటికీ పరిస్థితి విషమించి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గోపయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పాల్వంచలో గంజాయి పట్టివేత

పాల్వంచ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పాల్వంచ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం పెట్రోలింగ్ నిర్వహించడానికి వెళుతున్న పోలీసులకు వీరూనాయక్ తండా వద్ద అనుమానాస్పదంగా నలుగురు వ్యక్తులు తారసపడ్డారు. వారిని విచారించి తనిఖీ చేయగా వారివద్ద 380 గ్రాముల ఎండు గంజాయి లభించింది. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నామని, పట్టుబడిన గంజాయి విలువ రూ. 19 వేలు ఉంటుందని రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

సింగరేణిలో మొహర్రం మృతులకు నివాళి

ఇల్లెందు టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి స్రట్‌ఇంక్లైన్ గని ప్రమాదంలో మృతి చెందిన వారికి సింగరేణి అధికారులు ఆదివారం నివాళులర్పించారు. ఇల్లెందు పట్టణంలోని 24 ఏరియాలో గల స్మృతివనం వద్ద ఉన్న స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు 1938 మార్చి 12న మొహర్రం నాడు జరిగిన మైన్ ప్రమాదంలో 43మంది మృతి చెందారు. వారి స్మారకార్థం ప్రతి సంవత్సరం మొహరం సందర్భంగా నివాళులర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం కృష్ణయ్య మాట్లాడుతూ స్రట్ ఇంక్లైన్ గని ప్రమాదంలో మృతి చెందిన వారి త్యాగాల ఫలితంగానే ఇల్లెందు ఏరియాలో సింగరేణి మనుగడ కొనసాగుతుందని ప్రకటించారు. బొగ్గుగనులకు పుట్టినిల్లైన ఇల్లెందు ఏరియా నుంచి సింగరేణి ప్రస్థానం ఇతర ప్రాంతాలకు విస్తరించిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఎం. గిరిధరరావు, ఏరియా ఇంజనీరు నర్సింహరాజు, డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం, సివిల్ డీజీఎం రవికుమార్, వర్క్‌షాపు డీజీఎం నాగరాజు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి


లక్ష్మి(ఫైల్)

దుమ్ముగూడెం జూలై6 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపాకకు చెందిన సోడి లక్ష్మి(45) శనివారం రక్తపోటు సమస్యతో అనారోగ్యానికి గురైంది. దీంతో మారాయిగూడేనికి చెందిన ఓ ఆర్ఎంపీను ఆశ్రయించడంతో అతనికి తోచిన వైద్యం చేశాడు. పరిస్థితి చేయిదాటిందని భావించిన ఆర్ఎంపీ ఆమెను భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అదే రోజు సాయంత్రం తరలించాడు. పరిస్థితి సీరియస్‌గా ఉందనడంతో ఒక అంబులెన్స్ మాట్లాడి వెంటనే ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించి ఆదివారం ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందింది.

మద్యం మత్తులో వైద్యం ..

సదరు ఆర్ఎంపీ పగలు, రాత్రి మద్యం మత్తులో మునిగి తేలుతూ వైద్యం చేస్తాడనే ప్రచారం జరుగుతోంది. భద్రాచలం నుంచి ఖమ్మానికి రోగిని అంబులెన్స్‌లో తరలించే క్రమంలోనూ సదరు ఆర్ఎంపీ మద్యం మత్తులో ఉండి నెల్లిపాకకు చెందిన మరో ఆర్ఎంపీతో గొడవకు దిగడం విశేషం. ఖమ్మం వైద్యానికి తాను తీసుకెళ్తానంటే, తాను తీసుకెళ్తానని ఇద్దరు ఆర్ఎంపీలు వాగ్వాదానికి దిగారని తెలుస్తోంది. చివరకు మారాయిగూడెం ఆర్ఎంపీ రోగితో కలిసి అంబులెన్స్‌లో వెళ్లాడు. కాగా ప్రయాణం మధ్యలో పలుమార్లు మద్యం తాగేందుకు అంబులెన్స్‌ను ఆపాడని సమాచారం. దీంతో వైద్యసేవలు ఆలస్యమవడంతో ఆమె మృతి చెందినట్లు తెలుస్తోంది. ఐతే ఖమ్మం ఆసుపత్రిలో రోగి చేరిన తర్వాత తన కమీషన్ మాట్లాడుకొని సదరు ఆర్ఎంపీ ఇంటికి తిరిగి వెళ్లిపోయినట్లు సమాచారం.

ఆర్ఎంపీకి దేహశుద్ధి

వైద్య సేవల కోసం ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తానే తీసుకెళ్తానని పట్టుబట్టి తీసుకెళ్లి దగ్గరుండకుండా నిర్లక్ష్యంగా ఇంటికి వెళ్లిపోవడం, మద్యం కోసం అంబులెన్స్ పలుమార్లు ఆపడం, చివరకు లక్ష్మి ప్రాణాలు పోవడం ఆమె బంధువులకు ఆగ్రహం కలిగించింది. ఆదివారం లక్ష్మి మృతదేహాన్ని ఇంటికి తరలించిన ఆమె బంధువులు సదరు ఆర్ఎంపీనిఈ విషయమై ప్రశ్నించారు. ఏం చేసుకుంటారో చేసుకోండని సదరు ఆర్ఎంపీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడడంతో ఆగ్రహించిన మృతురాలి బంధువులు దేహశుద్ధి చేశారు. దీంతో భయపడిన సదరు ఆర్ఎంపీ నిద్రమాత్రలు మింగి భద్రాచలంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడని ప్రచారం జరగ్గా, అదంతా కేవలం డ్రామా అనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

రూ.30వేలకు సెటిల్మెంట్

ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు ఆర్ఎంపీ మరో ఇద్దరు ఆర్ఎంపీలను వెంట బెట్టుకొని పత్తిపాకలో సెటిల్మెంట్ చేసుకున్నట్లు సమాచారం. మృతురాలి కుటుంబానికి పరిహారంగా రూ.30వేలు ఇచ్చేందుకు అంగీకరిస్తూ ఒప్పందం జరిగిందని తెలుస్తోంది. మృతురాలికి భర్త, నలుగురు పిల్లలున్నారు. చిన్నపాటి అనారోగ్యానికి ప్రాణాలు పోగొట్టుకోవడం వెనుక మరోమారు ఆర్ఎంపీ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోందని ఆరోపణలు ఉన్నాయి.

ఆరా తీసిన వైద్యాధికారి

జరిగిన సంఘటనపై వైద్యాధికారి రుక్మాకరరెడ్డి బాధితుల నుంచి ఆరా తీశారు. తొలుత పత్తిపాకలో ఆర్ఎంపీ వైద్యం దగ్గర నుంచి భద్రాచలం, ఖమ్మం ఆసుపత్రుల్లో ఏం జరిగిందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

‘టీఎన్జీవో’లకు రాజీవ్ స్వగృహ ప్లాట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న గుంటుపల్లి శ్రీనివాస్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : టీఎన్జీవోస్ సభ్యులకు రాజీవ్ స్వగృహ ప్లాట్లను కేటాయించాలని జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం టీఎన్జీవో జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హౌస్ బిల్డింగ్ సొసైటీలో దాదాపు 3,500 పైగా సభ్యులు ఉన్నారని, గతంలో సగం మందికే ప్లాట్స్ ఇచ్చారని గుర్తు చేశారు. రాజీవ్ స్వగృహ ఫ్లాట్స్ నాలుగు బ్లాక్ లు టీఎన్జీవోస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యులకు కేటాయించాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో సమావేశంలో తీర్మానించారు. టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర కమిటీలో ఖమ్మం జిల్లా నాయకులు గంగవరపు బాలకృష్ణ , జైపాల్ విజయ్ కుమార్‌లకు అవకాశం కల్పించినందుకు రాష్ట్ర కమిటీకి జిల్లా కార్యవర్గం కృతజ్ఞతలు తెలియజేసింది. రాష్ట్ర కమిటీలో బాధ్యతలు స్వీకరించిన బాలకృష్ణ జైపాల్ లను జిల్లా కార్యవర్గం సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కొమరగిరి దుర్గాప్రసాద్, కోశాధికారి వల్లపు వెంకన్న, ఉపాధ్యక్షులు ఎర్రా రమేష్, బానోత్ శ్రీధర్ సింగ్, సగ్గుర్తి ప్రకాష్‌రావు, బదావత్ కరణ్ సింగ్, ఎస్.లలిత కుమారి, సహాయ కార్యదర్శులు తాళ్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు

కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలి

• భవన నిర్మాణ కార్మికసంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

ఇల్లెందు టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని భవన నిర్మాణ కార్మికసంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఇల్లెందులో తెలంగాణ భవన నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర ప్రథమ మహాసభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసంఘటితరంగ కార్మికులుగా భవన నిర్మాణ కార్మికులు దేశంలో కోట్ల సంఖ్యలో పని చేస్తున్నారని వారికి సరైన హక్కులు లేవన్నారు. నిత్యం ప్రమాదకర ప్రదేశాల్లో పని చేస్తున్న నిర్మాణ కార్మికులకు ఎలాంటి భద్రత లేకుండ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు బి. రాంసింగ్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బాణోత్ ఊక్లా, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కే. మదార్, కే. భాస్కర్‌రెడ్డి, రాంచందర్, సురేష్, పోలూరి శ్రీనివాస్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

వీరభద్రాచారికి వైద్య పండిత బిరుదు ప్రదానం

ఖమ్మం కలెక్టరేట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన పారంపర్య ఆయుర్వేద వైద్యులు రామడుగు వీరభద్రాచారికి "వైద్య పండిత" బిరుదు లభించింది. తెలంగాణ పారంపర్య వైద్య మహా సంఘం ప్రథమ వార్షికోత్సవం, ఆయుర్వేద వైద్య విజ్ఞాన సదస్సు జూలై 4,5,6 తేదీలలో యాదగిరిగుట్టలో నిర్వహించారు. ఈ సదస్సులో ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు రామడుగు వీరభద్రాచారికి బిరుదును ప్రదానం చేశారు. గత 45 ఏళ్ల నుంచి ఆయుర్వేద వైద్యునిగా వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్సలు నిర్వహిస్తున్నారు. రోగులకు వైద్య సేవలందిస్తున్నందుకు గాను గౌరవ పురస్కారం వైద్య పండిత బిరుదును వైద్యమహా సంఘం తెలంగాణ అధ్యక్షుడు దొంత యాత్రి మహర్షి, ఆంధ్రప్రదేశ్ పారంపర్య వైద్య మహా సంఘం, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర రాజు, ఎండి.జమాల్ ఖాన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరభద్రాచారిని పలువురు అభినందించారు.


వీరభద్రాచారికి బిరుదును ప్రదానం చేస్తున్న దృశ్యం

దేశభక్తి ముసుగులో అరాచకాలు

ఖమ్మంరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): దేశభక్తి ముసుగులో అరాచకాలు సృష్టిస్తూ బీజేపీ తమ పబ్బం గడుపుకుంటుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు షేక్.బషీరుద్దీన్ అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలోని ఫంక్షన్‌హాల్లో నిర్వహిస్తున్న సీపీఎం శిక్షణ తరుగతుల్లో భాగంగా రెండోరోజు ఆదివారం మతం-మతోన్మాదం అనే క్లాసును బషీరుద్దీన్ బోధించారు. బీజేపీ మతం పేరుతో మణిపూర్, గుజరాత్‌ల్లో మారణహోమం సృష్టించి యావత్తు దేశ ప్రజలు బాధితులకు అండగా నిలవకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాస్‌రావు, మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, డివిజన్, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



నగరంలో కొత్తబస్టాండ్ పక్కన ఇటీవల వర్షాలకు రోడ్లపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ సమస్యను 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురించటం తెలిసిందే.. దీనిపై అధికారులు స్పందించారు. గుంటలను పూడ్చేందుకు మరమ్మతులు చేపట్టారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ ఖమ్మం

కూడలిలో కోత

ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని అల్లీపురం రోడ్డు ధ్వంసమైంది. ఇదే రహదారిలో మూడురోడ్ల జంక్షన్‌లో రోడ్డుకు కోతకు గురైంది. ఫలితంగా పెద్దగుంత ఏర్పడింది. ప్రయాణికులు ద్విచక్ర వహనదారులు నరక యాతన పడుతున్నారు. ఈరహదారిపై ప్రయాణమంటే ప్రజలు భయపడుతున్నారు. రాత్రి వేళ వాహనదారులు, పాదచారులు కూడా నానా ఇక్కట్లు పడుతున్నారు. వాహనదారులు



ఏమాత్రం ఆదమరిచి ప్రయాణించినా ప్రమాదాలకు గురికావాల్సిందే.

ఫొటోలు: ఆంధ్రజ్యోతి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ ఖమ్మం

ముళ్ల పొదలే మూత్రశాలలు

- మరుగుదొడ్డి లేని ఖానాపురం ట్యాంక్‌బండ్
- సమీప నివాసాల వారిని సహాయం కోరుతున్న మహిళలు
- ఐదేళ్లుగా నిర్వహణలేని నడక దారి
- కలెక్టర్‌ను కలిసేందుకు సంతకాల సేకరణ ప్రారంభం





ఖానాపురం ట్యాంక్ బండ్, ఐదేళ్లుగా నిర్వహణ లేని వాకింగ్ దారి

ఖమ్మంకార్పొరేషన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో లకారం తర్వాత ప్రజాదరణ పొందినది ఖానాపురం ట్యాంక్‌బండ్.. పది డివిజన్‌ల ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు, యువత ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యాంక్ బండ్‌కు వాకింగ్‌కు వస్తుంటారు. రోజుకు 500 మందికి పైగానే వాకింగ్ చేస్తుంటారు. విలీన ప్రాంతాల్లోని ప్రజలకు వాకింగ్, వ్యాయామానికి అందుబాటులో ఉంటూ ప్రజాధరణ పొందుతోంది. వృద్ధులు, మధుమేహం, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అధిక సంఖ్యలో ఉంటారు. ఇక్కడ కనీసం ఒక్కమరుగుదొడ్డిని కూడా నిర్మాణం చేయలేదు. దీంతో ఉదయం 5గంటల నుంచి 8గంటల వరకు సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు వాకింగ్‌కు వచ్చే వారు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. వాకర్లు మరుగుదొడ్డి అందుబాటులో లేక పోవటంతో పురుషులు ట్యాంక్‌బండ్‌కు సమీపంలోనే ఉన్న ముళ్ల పొదల్లోకి వెళుతున్నారు. కొంతమంది వాకింగ్‌ను మధ్యలోనే నిలుపుదల చేసుకొని ఇంటిదారి పడ్తున్నారు. మహిళలు ట్యాంక్‌బండ్‌కు సమీపంలోనే నివాసాల మహిళల ఇళ్లకు వెళ్లి సహాయం కోరుతున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాల్లో ఇంటింటికి మరుగుదొడ్లపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు ఎంతో ప్రజాదరణ పొందిన ఖానాపురం ట్యాంక్‌బండ్‌పై ఒక్క మరుగుదొడ్డి నిర్మాణం చేయక పోవటంపై వాకర్స్ తీవ్రఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో ఏఎంసీ ఖానాపురం ట్యాంక్‌బండ్‌ను పరిశీలించిన సమయంలో వాకర్స్ పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. అయినా ఎటువంటి కదలిక రాలేదు. దీంతో వాకర్స్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ అనుదీప్‌ను కలిసేందుకు సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు.

ఐదేళ్లుగా నిర్వహణ లేని నడకదారి

ఖానాపురం చెరువు కట్టపై ట్యాంక్‌బండ్‌ను నిర్మాణంతో కట్టకుంగి నడకదారి కుంగిపోయింది. మెటల్‌తో ఏర్పాటు చేసిన నడక దారి ఎత్తుపల్లాలుగా మారింది. ఏడాదిలో కనీసం ఒక్కసారైన ట్యాంక్‌బండ్‌ల నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఐదేళ్లుగా నడకదారిపై తట్టెడు మట్టి కూడా పోయలేదని వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య ట్యాంక్‌బండ్‌ను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని వాకర్స్ కోరుతున్నారు.

'డీసీఈబీ సెక్రటరీ ఎంపిక నిబంధనలకు విరుద్ధం'

జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై6 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) సెక్రటరీ నియామకం నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేశారని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆర్.వీరస్వామి అన్నారు. ఆదివారం నగరంలోని రోటరీనగర్‌లో నిర్వహించిన సమావేశానికి జిల్లాలోని 40మంది హెచ్‌ఎంలు హాజరయ్యారు. ఈసందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ గతంలో రెండుసార్లు డీసీఈబీ సెక్రటరీగా పనిచేసి పలు ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని తిరిగి డీసీఈబీ సెక్రటరీగా ఎలా నియమించారని ప్రశ్నించారు ఇది పూర్తిగా నిబంధనలు ఉల్లంఘించడమేనన్నారు. వాస్తవానికి డీసీఈబీ సభ్యులలో ఒకరిని డీసీఈబీ సెక్రటరిగా నియమించాలని, అందుకు విరుద్ధంగా సభ్యుడు కానటువంటి వ్యక్తిని నియమించారన్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీకి,డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఆర్‌జేడీకి, కలక్టర్‌కు , జిల్లాలోని ముగ్గురు మంత్రులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆలయాలకు తొలిఏకాదశి శోభ

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై6 (ఆంధ్రజ్యోతి):తొలిఏకాదశి సందర్భంగా ఆదివారం ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. వారి కోసం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కమాన్‌బజార్ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఇందిరానగర్ పర్ణశాల రామాలయం,బాలాజీనగర్‌లోని అభయ వెంకటేశ్వర స్వామి ఆలయం, రామాలయం, గుంటుమల్లన స్వామి ఆలయం, బ్రాహ్మణ బజారు శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. విష్ణునామ స్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. దర్శనం అనంతరం భక్తులకు పేలపిండి తోపాటు తీర్థప్రసాదాలను ఆలయ నిర్వహకులు అందించారు.



గుట్ట ఆలయంలో స్వామివారు



గుట్ట ఆలయంలో బారులు తీరిన భక్తులు



ఎన్నెస్పీ రామాలయంలో





రంగనాయకుల గుట్ట ఆలయంలో..



ఎస్పీఆఫీస్‌రోడ్డు శివాలయంలో..

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై6(ఆంధ్రజ్యోతి):మొహర్రం పర్వదినాన్ని ఆదివారం నగరంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పది రోజులుగా పీర్ల సావిడిల వద్ద రాత్రి పూట ప్రత్యేక పూజలు నిర్వహించి ఆఖరు రోజు ఆదివారం పీర్లను గ్రామాలలో, పట్టణాలలో ఊరేగించి రాత్రి పీర్ల నిమజ్జనం చేశారు. శనివారం రాత్రి నుంచి ఉపవాసాలు చేసిన ముస్లీం యువకులు, పెద్దలు ఆదివారం ఉదయం పీర్లను ఎత్తుకోని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ ఊరేగింపులో పిల్లలు, పెద్దలు, యువత అధిక సంఖ్యలో హాజరై కోలాహలంగా మారింది. కుల మతాలకు అతీతంగా పీర్లు ఇంటి ముందుకు వచ్చినప్పుడు నీళ్లారపోసి తాహతకు తగ్గట్టుగా కానుకలు అందించారు.. భక్తితో గ్రామాలలో, పట్టణాలలో రాత్రి వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చెరువులు, వాగులు నదులలో పీర్ల నిమజ్జనం చేశారు.



చాంబర్‌లో 'ది ఖమ్మం మర్చంట్స్ అసోసియేషన్' విలీనం

ఖమ్మంగాంధీ చౌక్, జూలై 6(ఆంధ్రజ్యోతి): 'ది ఖమ్మం మర్చంట్స్ అసోసియేషన్' చాంబర్ ఆఫ్‌కామర్స్‌లో విలీనమైంది.ఈమేరకు సభ్యులు ఏకగ్రీవంగా అంగీకారం తెలిపారని చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, పూర్వపు గౌరవ అధ్యక్షుడు కొప్పు నరేష్ కుమార్, అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ప్రధానకార్యదర్శి మెంతుల శ్రీశైలం, పూర్వపు ప్రధాన కార్యదర్శి గొడవర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు సోమానరేష్, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణయ్య, కోశాధికారి తల్లాడ రమేష్ స్పష్టం చేశారు. ఆదివారం వర్తక సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. భవిష్యత్తులో తమ సంస్థను 'చాంబర్ ఆఫ్ కామర్స్' అనే పేరుతో చట్టబద్ధంగా కొనసాగిస్తామని ప్రకటించారు. తమ సంఘ భవనం పూర్తిగా తమ అధీనంలోనే ఉందని, ఎవరైనా అవాస్తవ ప్రచారాలు చేస్తే, చట్టపరంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. 'చాంబర్ ఆఫ్ కామర్స్'లో 19వాణిజ్య విభాగాల నుంచి ఏర్పడిన 1200పై చిలుకు మంది గౌరవ సభ్యులతో విస్తరించిందని అన్నారు. సంస్థను చట్టపరంగా మరింత పారదర్శకతో చేయాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సభ్యులందరిని పునరాలోచన చేసి, కొత్త సభ్యులుగా అందరికీ సభ్యత్వం నమోదు చేసామన్నారు. ఈ ఎన్నికలకు పీబీ. శ్రీరాములు ఎన్నికల అధికారిగా వ్యవహరించి నిర్వహించారన్నారు.





మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు చిన్నికృష్ణారావు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం

మహిళా సమాఖ్య సీసీ మృతి



కూసుమంచి,జూలై6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన మహిళా సమాఖ్య సీసీ నలగాటి వీరయ్య(50) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు.కామేపల్లి మండలంలో మహిళాసమాఖ్య సీసీగా పని చేస్తున్నారు. కొంత కాలంగా లివర్ సమస్యతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఖమ్మంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. వీరయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

'చేతన గ్లోబల్ ఫౌండేషన్' అధ్యక్షుడికి విశిష్ట సేవా పురస్కారం

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై 6(ఆంధ్రజ్యోతి):చేతన గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెనిగళ్ల రవికుమార్‌కు ఉత్తర అమెరికా తెలుగుసంఘం ఆధ్వర్యంలో విశిష్ట సేవా పురస్కారం లభించింది. ఫ్లోరిడా, టంపా, ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఫ్లోరిడాటంపా కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన 8వ వార్షికోత్సవ వేడుకల్లో ఈ పురస్కారం అందించారు. ఈ సదర్భంగా పలువురు రవికుమార్‌ను అభినందించారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలి

- సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం

నేలకొండపల్లి,జూలై6(ఆంధ్రజ్యోతి):చరిత్రను వక్రీకరిస్తూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం రాష్ట్రనాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. నేలకొండపల్లిలోని రావెళ్లభవన్‌లో రెండు రోజుల పాటు జరుగనున్న రాజకీయ శిక్షణ తరగతులను ఆదివారం పొన్నం వెంకటేశ్వరరావు ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కట్టికోల వెంకన్న ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన తరగతుల్లో పొన్నం మాట్లాడుతూదేశాన్ని హిందూ దేశంగా మార్చటానికి బీజేపి కుట్ర పన్నుతున్నదని విమర్శించారు. బీజేపీ మతోన్మాద రాజకీయాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అమెరికా ఆధిపత్యాన్ని నిలుపుకునేందులకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య యుద్ధాలను ప్రేరేపిస్తున్నాడని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికన్లు సోషలిస్టు సమాజం వైపు అడుగులు వేస్తుండటం శుభ పరిణాణమన్నారు. కార్యక్రమంలో గుడవర్తి నాగేశ్వరరావు, కొప్పుల వెంకట్రామిరెడ్డి, పగిడికత్తుల నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి, భూక్యా కృష్ణ, రచ్చా నర్సింహారావు, సిరికొండ ఉమామహేశ్వరి, శీలం అప్పారావు, బలుసు ప్రమీల కోదండరామారావు, గురజాల వెంకటేశ్వర్లు, గాదె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూసుమంచిలో రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం

కూసుమంచి: ఉదారవాద పార్టీలకు, ఆలోచనలకు వ్యతిరేకంగా సీపీఎం కార్యకర్తలు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలునునిచ్చారు. ఆదివారం కూసుమంచిలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో రెండురోజుల రాజకీయశిక్షణ తరగతులు ప్రారంభించారు. పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతు మార్కిస్ట్ పని విధానంతోనే పీడిత ప్రజలు విముక్తి చెందుతున్నారని అన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు శీలం గురుమూర్తి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లెల షన్మతిరావు, మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, ఎడవల్లి రమణారెడ్డి, తాళ్లూరి వెంకటేశ్వర్లు, గంగాధర్, కర్ణబాబు, చిట్టూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రయాణం.. నరకం

తాళ్లగూడెం - పింజరమడుగు రహదారి గుంతలమయం







తాళ్లగూడెం నుంచి పింజరమడుగు వరకు బీటీరోడ్డు దృశ్యాలు

కామేపల్లి, జూలై6(ఆంధ్రజ్యోతి): ఆ రహదారి అడుగు అడుగునా గుంతలమయం.. మూడు కిలోమీటర్లు ప్రయాణించాలంటే 30 నిమిషాలు పడుతుంది.. వర్షాకాలం వస్తే ఆ రహదారి చెరువులను తలపించే మారుతుంది. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ కామేపల్లి మండలం తాళ్లగూడెం నుంచి పింజరమడుగు వరకు బీటీరోడ్డు పరిస్థితి.. ఈరహదారిని 15ఏళ్ల కితంనిర్మించారు. ఐదేళ్లకే ధ్వంసమైంది. అక్కడక్కడ చిన్నపాటి గుంతలను తాత్కాలికంగా పూడ్చివేశారు. ఈసారి మళ్లీభారీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఈరోడ్డు మీద ప్రయాణం నరకప్రాయంగా మారింది. వర్షం వస్తే ప్రయాణం చేయడం కష్టంగా మారింది. తాళ్లగూడెం నుంచి పింజరమడుగుతండ వరకు అడుగు అడుగుకో గుంత ఉండడంతో ప్రజలు ఆ రోడ్డు మార్గంలో రావలంటే వణుకుతున్నారు.. గత ప్రభుత్వంలో ప్రజలు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. గత ఎన్నికల ప్రచారంలో ఉన్న కోరం కనకయ్యకు రోడ్డు నిర్మాణం చేపడితే గెలిపిస్తామని ప్రజలు విన్నవించారు. గెలిచిన తరువాత ఆయన ఇంతవరకు ఈ రోడ్డు గురించి పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు. ఇప్పటికైన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పట్టించుకొని నూతన రోడ్డు నిర్మాణం చేపట్టేలా కృషి చేయాలని మూడు గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. అధికారులు తక్షణం స్పందించి రహదారిని పునర్ నిర్మించాలని కోరుకుంటున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఏఈ వరప్రసాద్ గతంలో వివరణ అడగగా రోడ్డు మంజూరు అయింది కానీ టెండర్‌వేసే వారు లేని చెప్పారు. ఇదే విషయంపై ప్రస్తుత ఆర్‌ఎండ్‌బీ ఏఈ ప్రవీణ్‌ను వివరణ కోరేందుకు పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా ఆయనఅందుబాటులోకి రాలేదు..

శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటా

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మంరూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు స్వానబోయిన శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి అండగా ఉంటానని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం వారి ఇంటికి వెళ్లి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం నాయుడుపేట నుంచి బైపాస్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్నామని రోడ్డు విస్తరణను తగ్గించాలని స్థానికులు మంత్రి పొంగులేటికి వనతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి స్థానికులకు ఇబ్బందులు రాకుండా విస్తరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బండి జగదీష్, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, వారారెడ్డి, బోడా వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి

ఇల్లెందు నుంచి యాదగిరిగుట్టకు ప్రత్యేక బస్సులు

ఇల్లెందు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు నుంచి యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం దర్శనానికి ప్రతీ ఆదివారం ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జూలై13 నుంచి బస్సు సర్వసులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం 5గంటలకు ఇల్లెందు బస్సు డిపో నుంచి డీలక్స్ బస్సు బయలుదేరి మహబూబాబాద్ తొర్రూరు జనగాం మీదుగా యాదగిరి గుట్టకు చేరుతుందని చెప్పారు. భక్తులు యాదగిరి గుట్టలో లక్ష్మి నరసింహా స్వామి దర్శనంతో పాటు స్వర్ణగిరి వెంకటేశ్వర్ స్వామి దర్శనం చేసుకున్న అనంతరం రాత్రి 10గంటలకు ఇల్లెందుకు చేరుకుంటుందని వెల్లడించారు. యాదగిరి గుట్టకు పెద్దలకు ఛార్జీ రూ.840, పిల్లలకు రూ.440 ఛార్జీలుగా ఉంటాయని వివరించారు. భక్తులు ఆన్‌లైన్‌లో సైతం రిజర్వేషన్ చేయించుకోవచ్చని ఆర్‌ఎం సరిరాం నాయక్ చెప్పారు.

నేడు ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన

కారేపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పలు గ్రామల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరైన ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని మండల కాంగ్రెస్ కమిటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 10:30గంటలకు రేలకాయలపల్లి, 11గంటలకు జేత్రాంతండా, 12గంటలకు మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మధ్యహ్నం 2గంటలకు మండల కేంద్రంలో అధికారులతో సమీక్షనిర్వహించనున్నారు. ఎమ్మెల్యే పర్యటన కార్యక్రమంలో మండళ పరిధిలోని పార్టీనాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటి కోరింది.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



సత్తుపల్లి గీతాజ్ఞానమందిరంలో పూజల్లో భక్తులు



పెనుబల్లి నీలాద్రీ ఆలయంలో



కల్లూరు వేణుగోపాలస్వామి ఆలయంలో

పెనుబల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు దేవాలయాల్లో ఆదివారం తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవిశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, ఆషాడమాసం, శుక్లపక్షం ఏకాదశి సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పెనుబల్లి కోదండరామాలయం, బయ్యన్నగూడెం వీరవెంకటసత్యనారాయణస్వామి ఆలయం, వీఎంబంజర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం, నీలాద్రీశ్వర ఆలయాలతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

సత్తుపల్లిరూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏకాదశి సందర్భంగా ఆదివారం సత్తుపల్లిలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా గీతాజ్ఞానమందిరంలో భక్తబృందంచే భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం పఠించారు. అలాగే ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చక స్వామి తీర్థప్రసాదాలు అందజేయగా ఆలయ కమిటీ సభ్యులు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కొత్తూరు రాజేశ్వరరావు, వనమా గురునాధం, బాలాజీరావు, శ్రీనివాసరావు, వెంకట్, శారద, పుష్పావతి, కోటేశ్వరి, సంధ్య, ఝాన్సీ, మోహిని, పద్మిని, లక్ష్మీ, జయశ్రీ, నిర్మల, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని పలు దేవాలయాల్లో ఘనంగా ఏకాదశి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి మూలవర్లకు పంచామృతాలతో అభిషేకం చేశారు.

తల్లాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాల్లో భక్తులు తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి దేవాలయాను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారుక.

ఎర్రుపాలెం,జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏకాదశి పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ కె విజయకుమారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రుపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రతి పేదవాడికి ఇల్లుండాలి

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వనంవారిక్రిష్టాపురంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న భట్టి

ముదిగొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి ఇల్లుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం ముదిగొండ మండలం పెద్దమండవ, బాణాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం వనంవారిక్రిష్టాపురంలో ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గడచిన పదిసంవత్సరాల్లో ఏ ఒక్క ఊరిలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేకపోయిందని. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డా ఏడాదిన్నరలోపు ఈ ఏకాదశి రోజున పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని వారికి సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వబోతున్నామని, తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు ఇతర రాష్ట్రాలు రోల్‌మోడల్‌గా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను 25ఎకరాల్లో నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాది నాటికి పూర్తవుతాయని, పిల్లల విద్య బాధ్యత తమదని భట్టి విక్రమార్క తెలిపారు. అనంతరం పలు సమస్యలపై ప్రజలు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీపీవో ఆశాలత, సొసైటీ చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, వెంకటయ్య, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీడీవో భాస్కర్‌రావు, విజయలక్ష్మీ, ఎంపీవో వాల్మీకి కిషోర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, నాయకులు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, ఉసికల రమేష్, మల్లెల అజయ్, ఝాన్సీ రాణి, మట్టా రవీందర్‌రెడ్డి,నాగేశ్వరరావు, బాబూరామిరెడ్డి, పల్లపాటి కృష్ణ పాల్గొన్నారు.

టూరిస్ట్‌స్పాట్‌గా మధిర ట్యాంక్‌బండ్

మధిరటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): టూరిజానికి ఖేరాఫ్‌గా మధిర ట్యాంక్‌బండ్‌ను నిలిపేలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టటం జరిగిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మధిర ట్యాంక్‌బండ వద్ద 6.45 కోట్లతో చేపట్టే టూరిజం పనులకు జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో కలిసి శంకుస్థాపన చేసారు. మధిర ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే 10 కోట్లతో బండ్ వెడల్పు, రోడ్డు నిర్మాణ కార్యక్రమం చేపట్టటం జరిగిందని అన్నారు. తాజాగా 6.45 కోట్లతో పర్యాటక సౌకర్యాల కల్పనకు కేటాయించామన్నారు.

సమసమాజ స్థాపనే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జమ్ముల జితేందర్‌రెడ్డి

మధిర రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనే భారత కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్రసమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మధిర రిక్రీయేషన్ క్లబ్‌లో సీపీఐ మధిర మండల 18వ మహాసభ పెరుమాళ్లపల్లి ప్రకాశరావు అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభానికి ముందు సభా ప్రాంగణంలో నల్లబోతు రత్తమ్మ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో రోజురోజుకు ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందన్నాని విమర్శించారు. బీజేపీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రధానంగా కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను హతమార్చుతున్నారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని, నిత్యావసర సరుకుల ధరలను ప్రతి ఒక్క సామాన్యుడికి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు బెజవాడ రవిబాబు, మందడపు రాణి, వూట్ల కొండలరావు, పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, చెరుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాగ్యనగర్‌తండాలో బోనాలపండుగ

కారేపల్లి జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాగ్యనగర్ తండాలో ఆదివారం గ్రామంలోని మహిళలు బోనాలపండగ వేడుకలు నిర్వహించారు. తయారు చేసిన బోనాలను గ్రామంలోని ముత్యాలమ్మతల్లికి సమర్పించారు. కార్యక్రమంలో గుగులోత్ హర్షనాయక్, రవినాయక్, ప్రేమ్, వీరన్న, రవీందర్,అఖిల్, అనిల్,తరుణ్, పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వంపై సన్నగిల్లుతున్న ఆశలు

» సీపీఎం నేత బొంతు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

కారేపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలు సన్నగిల్లుతున్నయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో జరుగుతన్న పార్టీ నాయకుల శిక్షణశిభిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్బంగా రాంబాబు మాట్లాడుతూ.. రైతు రుణమాఫి మధ్యలో నిలిపివేశారని, రబీ రైతు భరోసా 4ఎకరాలకే పరిమితం చేశారని తెలిపారు. గత ప్రభుత్వ పథకాల అమలు చేయలేని కారణంగానే అధికారానికి దూరమైందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామిలను అమలు చేయాలని, వాటి అమలకు సీపీఎం పోరాటాలు చేస్తుందన్నారు. తరగతులకు ప్రిన్సిపాల్‌గా మండల కార్యదర్శి కె.నరేందర్ వ్యహరించారు. జిల్లా కమిటి సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, వజ్జా రామారావు, కోండబొయిన ఉమావతి, తలారి దేవప్రకాష్, పండగ కోండయ్య, కేసగాని ఉపేందర్,గుర్రం వెంకటేశ్వర్లు, కరపాటి సీతారాములు, ముండ్ల ఏకాంబరం, లక్ష్మణ్, శోభన్, రాంమూర్తి పాల్గొన్నారు.

యూరియాను అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మల్లెంపాటి రామారావు అధ్యక్షతన ఆదివారం వైరాలో జరిగిన రైతు సంఘ సమావేశంలో రాంబాబు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా యూరియా ఉత్పత్తి తగ్గించి సరఫరాలో కోత పెడుతోందని ఆరోపించారు. సహకార సంఘాలతోపాటు ఎరువుల దుకాణాల్లో కూడా యూరియాను విక్రయించాలని డిమాండ్ చేశారు. వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు వెంటనే నీరు విడుదల చేయాలని కోరారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్లు రైతులు పంటపొలాల్లోకి వెళ్లేందుకు ఏర్పాటుచేయాలన్నారు. నాయకులు చలపతిరావు, పైడిపల్లి సాంబశివరావు, బెజవాడ వీరభద్రం పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అఖిలపక్షనాయకులు

కొణిజర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని ఎండగట్టేదానికై ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మండల అఖిల పక్షనాయకులు తాళ్ళపల్లి కృష్ణ, తోటపల్లి సీతరాములు, తండుసోమయ్య, కిలారు కిరణ్ కుమార్, పాముల వెంకటేశ్వర్లు, షేక్ ఖాసీం, తడికమల్ల సీతరాములు పిలుపునిచ్చారు. ఆదివారం స్వర్ణ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వారు మాట్లాడారు. రైతాంగం, కార్మికులు పట్ల కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో తీవ్రిబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు, పార్టీ అనుబంధసంఘాల నాయకులు చెరుకుమల్లి కుటుంబరావు, బానోతు కిషన్, చల్లా ఉపేందర్, శ్రీనివాసరావు, గుగులోతు బాబు, చిన్నదానయ్య, హరిచందు, సలీం పాల్గొన్నారు.

గ్రామాల్లో మొహర్రం సందడి



తనికెళ్ళలో పీరీలను ఊరేగిస్తున్న దృశ్యం

కొణిజర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పీరీల పండుగను పురష్కరించుకొని ఆదివారం తనికెళ్ళ, అమ్మపాలెం గ్రామాలలో భక్తులు పీరీలను ఊరేగింపు చేశారు. ప్రతి ఏటా అమ్మపాలెం గ్రామంలో వారం రోజులపాటు పీరీల పండుగను జాతరల నిర్వహిస్తారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అక్కడకు చేరుకొని పీరీలకు పూజలు చేసి మొక్కులను తీర్చుకుంటున్నారు. ఏడాది కూడ పీర్లసావిడి వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. ఆదివారం పీరీలను ఊరేగింపు చేశారు.

ఏన్కూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మొహర్రం సందడి నెలకొంది..హుస్సేన్, అస్సేన్ త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగను గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు రాత్రి నిప్పుల గుండం చుట్టూ ఆడే అసోహదులకు ప్రజలు పెద్దఎత్తున హాజరవుతున్నారు. 9వరోజు టీఎల్ పేట ,రేపల్లేవాడ, తిమ్మరావుపేట, గార్లొడ్డు, నాచారం, బురదరాఘవాపురం గ్రామాలలో పేర్లను గ్రామల్లో ఊరేగింపు నిర్వహించారు.

జగ్జీవన్‌రామ్‌ని యువత ఆదర్శంగా తీసుకోవాలి



పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

సత్తుపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బాబూ జగ్జీవన్‌రామ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్బంగా స్మరించుకుంటూ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, రాజకీయ నాయకుడిగా దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీతో పాటు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బాబూజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్‌రామ్ అంటరాని వారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దళిత చిహ్నమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాణోత్ విజయ్ అన్నారు. కార్యక్రమంలో సాలి శివ, నరేష్, సుదర్శన్ మిశ్రా, చీకటి వసంతరావు, మెరుగు శేషగిరి రావు, మందా శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం

» సీపీఐ మహాసభలో సింగు నరిసింహారావు



ప్రసంగిస్తున్న సిపిఐ జిల్లా నాయకుడు నరిసింహారావు

కల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరిసింహారావు అన్నారు. ఆదివారం కల్లూరులోని విజ్ఞాన్ పాఠశాలలో ఆ పార్టీ మండల మహాసభ జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను రద్దు చేసి హక్కులను హరించిందని విమర్శించారు. నల్ల చట్టాలను ప్రవేశ పెట్టి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేటర్లకు లక్షల కోట్లు కట్టబెడుతోందని ఆరోపించారు. కార్మికుల, కర్షకుల, పేద వర్గాల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నది సీపీఐ మాత్రమేనని చెప్పారు. జూలై 9 న దేశ వ్యాప్త జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు పిలుపు నిచ్చారు. సమస్యల కోసం కూలీలు నిర్వహించే పోరాటాలకు అండగా నిలుస్తామని అన్నారు. ఇంకా ఈ సభలో జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, సత్తుపల్లి నియోజకవర్గ సిపిఐ పార్టీ కార్యాదర్శి దండు ఆదినారాయణలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, మండల సిపిఐ కార్యదర్శి దామాల దయాకర్, నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, యోబు, పాగా సత్యవతి, పి వీరయ్య, భద్రయ్య, వెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు పునాది సీపీఐ



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

తల్లాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజా ఉద్యమాలకు సీపీఐ పునాది వేసిందని ఆ పార్టీ జిల్లా నాయకుడు సింగు నరసింహారావు అన్నారు. ఆదివారం తల్లాడలోని పోటు ప్రసాద్ ప్రాంగణంలో నల్లమోతు నరసింహారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సీపీఐ పోరాడుతుందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంతోపాటు తెలంగాణ రాష్ట్ర సాధన , ఉమ్మడి ఖమ్మంజిల్లా అభివృద్ధి కోసం అనేక పోరాటాలు చేసిన ఘనమైన ఉద్యమ చరిత్ర సీపీఐకి ఉందన్నారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావస్తున్న సందర్బంగా పార్టీ సాధించిన విజయాలను నెమరువేసుకుంటూ భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి బాటలువేయాలని కోరారు. మతోన్మాద శక్తులను ఎండగట్టి ప్రజలను చైతన్యవంతులను చేసే విధంగా పార్టీ నాయకత్వం కృషిచేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్బంగా అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కోరారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు తాటి వెంకటేశ్వర్లు, దండు ఆదినారాయణ, జాగర్లముడి రంజిత్‌కుమార్, రావి శివరామకృష్ణ, మద్దోజు శ్రావణ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నిమ్మటూరి రా మకృష్ణ, మండల కార్యదర్శి ఓర్సు రమేస్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు ప్రాధాన్యత కల్పించాలి

ఏన్కూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వంలో మున్నూరుకాపులకు తగిన ప్రాధాన్యత కలిపించాలని మున్నూరుకాపు మండల అధ్యక్షుడు కొవ్వూరు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక సాయితాగూర్ ఫంక్షన్‌హాల్ లో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కొవ్వూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ మంత్రివర్గంలో మున్నూరుకాపులకు ఒక్కమంత్రి పదవి కూడా ఇవ్వకుండా మోసంచేసిందన్నారు. మున్నూరుకాపులకు గత ప్రభుత్వంలో కేటాయించిన భూమిలో మున్నూరుకాపు భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. మున్నూరుకాపులంతా ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు పిన్ని వెంకటనారాయణ, ఆవుల నరసయ్య, ఇండ్లకృష్ణయ్య, పాశం వెంకటేశ్వరరావు, ముదిగొండ నాగేశ్వరరావు, కనిశెట్టి వెంకన్న, కూరాకుల రమేష్, యాసా చందర్‌రావు, పోతుల సైదులు, సురేస్, మారేపల్లి నరేంద్రబాబు, నారపరాజు రాంబాబు, నరసింహారావు, పొట్లపల్లి శ్రీనివాసరావు, భూపతి వెంకటేష్, ఇల్లూరి రాంబాబు, ఇండ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మంల అధ్యక్షుడుగా కొవ్వూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడుగా గిద్దగిరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఆది నరసింహారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేటి మండల మహాసభను విజయవంతం చేయండి



తనికెళ్ళలో మాట్లాడుతున్న యర్రాబాబు, పీవీరావు, భాస్కర్‌రావు

కొణిజర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నేడు మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామంలో నిర్వహించే సీపీఐ కొణిజర్ల మండల 18వ మహాసభకు పార్టీ ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జీ యర్రాబాబు, జిల్లా నాయకులు పీవీరావు, గడల భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మహాసభ ఏర్పాట్లును వారు దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. భవిష్యత్తులో నిర్వహించే పోరాటాలపై మహాసభ వేదికగా చర్చించడం జరుగుతుందని తెలిపారు. మహాసభకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయసమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నారని, పార్టీ ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, మేకల మల్లిఖార్జున్‌రావు, బాస నాగరాజు, లకావతు రాములు, బానోతు రామయ్య, పొట్లపల్లి నరసింహరావు, పొట్లపల్లి నరేష్, బెజవాడ రాంబాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో సమాజానికి ముప్పుతప్పదు

సత్తుపల్లిరూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగంతో భవిష్యత్‌లో సమాజానికి ముప్పుతప్పదని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గంగారంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాలుష్య రహిత పర్యావరణాన్ని నిర్మిద్దామని, ఇందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్దన్‌బాబు, మోదుగు వెంకటేష్, వందనపు భాస్కరరావు, సుగ్గుల బాబూరావు, రాచమళ్ల రాము, కర్నాటి వెంకట్రావు, కాకర్ల మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా పల్లకిసేవ



మాలధారణ భక్తులు పల్లకిసేవ ఊరేగింపు చేస్తున్న దృశ్యం

వైరా, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం వైరాలో సాయిబాబా మాలధారణ భక్తులు స్వామివారి పల్లకిసేవ ఊరేగింపును నిర్వహించారు. వైరా మునిసిపాలిటీ ఐదో వార్డు సాయినగర్‌లోని షిర్డీసాయిబాబా మందిరం నుంచి ఈ పల్లకిసేవ ఊరేగింపు ప్రారంభించిరహదారుల్లో నిర్వహించారు. సాయిబాబాకు అభిషేకాలు, తులసీదళాలు, పూజలు నిర్వహించారు.

నిబంధనలు పాటించని అధికారులు

బోనకల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ ఫ్యాక్టరీ అధికారులు నిబంధనలను పాటించడం లేదని, దీని వల్ల తాము నష్టపోతున్నామని పామాయిల్ సాగు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సాయిబాబా కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత నెల 2వ తేదిన పామాయిల్ టన్ను ధర రూ. 18,740 ప్రకటించగా తాము వైరా కొనుగోలు కేంద్రంలో గెలలను విక్రయించామని తెలిపారు. ఆ తరువాత ఈ నెల 1వ తేదిన టన్ను ధరను రూ. 17, 462 ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తాము అమ్మినపుడు ప్రకటించిన ధర కాని, తాజాగా ప్రకటించిన ధర కూడ కాకుండ మరో రకంగా టన్ను ధరను రూ. 16,400 తమ ఖాతాలో వేశారని దొబ్బల పిచ్చయ్య, పోలూని నాగేశ్వరరావు, చావా వెంకటేశ్వరరావులు తెలిపారు. ధరల్లో తేడానా? కాంటాల్లో తేడానా? ఏమి తెలియడం లేదని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

గోగినేని కుటుంబాన్ని పరామర్శించిన మువ్వా, సండ్ర

పెనుబల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్‌కు చెందిన గోగినేని రంగారావు కుమారుడు, యలమర్తి శ్రీనివాసరావు అల్లుడు అయిన సురేష్ కుటుంబాన్ని టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం పరామర్శించారు. సురేష్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా కుటుంబసభ్యులకు సానుభూతి, సంతాపం తెలిపారు.

అంతరించిపోతున్న పెంపుడు జంతువు

సత్తుపల్లిరూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఏ ఇంట్లో చూసిన పశువులు, మేకలు, కుక్కలు, పిల్లులు పెంపుడుతు జంతువులుగా ఇంట్లోవారితో కలిసిమెలసి ఉండేవని, కానీ నేడు మానవుని బిజీ లైఫ్ కారణంగా అవి అంతరించి పోతున్నాయని పశు సంవర్ధకశాఖ ఏడీ డా.కొంగల ప్రదీప్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్బంగా ఆదివారం స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో వీధి, పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా రేబీస్ నివారణ టీకాలు వేసి జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డా.సీహెచ్.శశిదీప్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఆర్.కిరణ్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వీ.పృథ్వీ, ఎం.నాగేశ్వరరావు, సుమాంజలి రాము, సాయి గణేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.